## క్లుప్తంగా

### నేడు మండలంలో పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలంలో సోమవారం సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దే లబ్ధిదారులు పింఛన్లు తీసుకోవచ్చన్నారు. పింఛనుదారులు ఇంటివద్దనే అందుబాటులో ఉండి పింఛన్ నగదు తీసుకోవాలన్నారు. ఉదయం 8 గంటలకు బీఎన్ఆర్‌పేట జెడ్పీ పాఠశాలలో పింఛన్ల పంపిణీ లాంఛనంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

### ఉచిత కంటి ఆపరేషన్‌కు 60 మంది ఎంపిక

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అరవింద్ హాస్పిటల్ వైద్యులు 149 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 60 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరికి ఉచితంగా ఆపరేషన్, వసతులు కల్పించనున్నట్లు నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, విశాల్, ప్రవీణ్, జ్యోతి, లలిత్ పాల్గొన్నారు.

### బభ్రువాహన పదవీ విరమణ

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ బభ్రువాహన ఆదివారం పదవీ విరమణ కార్యక్రమం చిత్తూరులో నిర్వహించారు. ఆ శాఖ సీజీఎం అయూబ్‌ఖాన్, ఎస్ఈలు సురేంద్రనాయుడు, రమణ, పూర్వ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ వాసురెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం పలువురు అధికారులు సన్మానించారు.

### సమన్వయంతో చిత్తూరు అభివృద్ధి

చిత్తూరు అర్బన్: చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు చిత్తూరు అభివృద్ధికి కృషి చేస్తామని వైస్ ప్రెసిడెంట్ సత్య అన్నారు. నగరంలోని స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం, పార్కింగ్, రహదారులు, నీటి సరఫరా, విద్యుత్ సరఫరా తదితర సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో గోపి నాయక్, మురళి, రమేష్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

చిత్తూరు కలెక్టరేట్: నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించేందుకు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ కలెక్టర్‌తో భేటీ అయ్యారు. ఎమ్మెల్యే ఆదివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిధిలోని పలు అంశాలపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే కాసేపు చర్చించారు. నియోజకవర్గంలో పరిష్కరించాల్సిన ప్రజల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

### పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

తవణంపల్లె: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో 9,821 మంది పింఛను లబ్ధిదారులకు రూ.6,26,68,000 మంజూరైనట్లు వివరించారు. ఒకటో తేదీన పింఛన్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు నగదు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఇంటి దగ్గరే ఉండి డబ్బులు తీసుకోవాలని కోరారు.


### భగవద్గీత గొప్పదనాన్ని తెలుసుకోవాలి



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ప్రభోద సేవాసమితి సభ్యులు

పలమనేరు: భగవద్గీతను చదవడం పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని, దాని గొప్పదనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, గీతను చదవడం ఓ బాధ్యతగా భావించాలని స్థానిక త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రభోద సేవాసమితి నిర్వాహకులు భాస్కర్ కోరారు. మున్సిపాలిటీలోని గొబ్బిళ్లకోటూరులో ఆదివారం భగవద్గీతపై వారు ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో బాలాజి, వాణిశ్రీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### కల్లూరు లయన్స్ క్లబ్‌కు ఐదు అవార్డులు



అవార్డు అందుకుంటున్న మహమ్మదాలీ

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు లయన్స్‌క్లబ్ అందించిన వివిధ సేవలకు ఐదు అవార్డులు వరించాయని ఆ క్లబ్ జిల్లా క్రీడా విభాగం అధ్యక్షుడు లయన్ మహమ్మదాలీ తెలిపారు. ఆదివారం బెంగళూరులో కర్ణాటక ప్రభుత్వ బిలియర్డ్స్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. జిల్లా గవర్నర్ లయన్ రామరాజ్ ఆర్స్ అధ్యక్షతన అంతర్జాతీయ డైరెక్టర్ వీవీ కృష్ణారెడ్డి ఈ అవార్డులను అందజేశారు. ఉత్తమ రూరల్ క్లబ్‌గాను, విద్యారంగం, క్రీడారంగం, ఉత్తమ కార్యదర్శిగా వెంకటసిద్ధులుకు, ఉత్తమ జిల్లా క్రీడా విభాగం అధ్యక్షుడిగా మహమ్మదాలీకి ఉత్తమ లియో క్లబ్‌లకు అవార్డులు వచ్చినట్టు తెలియజేశారు.

# సేంద్రియం.. లాభాలు అధికం!

- రసాయనిక ఎరువుల వినియోగంతో రైతులకు నష్టాలు
- క్రమంగా పెరుగుతున్న సేంద్రియ ఎరువుల వాడకం
- భూసారం పెరగడంతో పాటు పెట్టుబడులు తగ్గుతుండటంతో మొగ్గు



సేంద్రియ సాగును పరిశీలిస్తున్న అధికారులు, విదేశీ ప్రతినిధులు (ఫైల్)

కాణిపాకం: విచ్చలవిడిగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమి తన సహజ లక్షణాన్ని కోల్పోయి చౌడు భూములుగా మారిపోయే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అంతేకాక పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గిపోతాయని హెచ్చరిస్తున్నారు. రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచిస్తున్నారు. మరోవైపు తెగుళ్లు ఎక్కువై ఏటా నష్టాలను చవి చూస్తుండడంతో రైతుల ఆలోచనల్లో కూడా మార్పు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో వారు పశువుల వ్యర్థాలను పంట పొలాల్లో కలపడం ద్వారా భూ సారాన్ని పెంచుకునేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకల విసర్జితాలను కొనుగోలు చేసి పంట పొలాలకు తోలుతున్నారు. వేరే ప్రాంతాల నుంచి మేత కోసం వచ్చే గొర్రెలు, మేకల కాపరులకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది.

**ఎరువుల లభ్యత ఇలా...**

- పశువుల వ్యర్థాలను పొలాలకు తోలుకోవడంతో పాటు గొర్రెల, మేకలను పొలంలో మంద కట్టించడం, కోళ్ల వ్యర్థాలు వంటి వాటిలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి.
- పశువుల పేడను కంపోస్టు విధానం ద్వారా నిల్వ చేసుకున్న తర్వాత పంట పొలాలకు తరలించుకోవాలి.
- వేప పిండి, పొగాకు పిట్టు వంటివి కొనుగోలు చేసుకోవచ్చు. అంతేకాకుండా రైతులు సొంతంగా వర్మీ కంపోస్టు ఏర్పాటు చేసుకుని సేంద్రియ ఎరువును తయారుచేసుకోవచ్చు.

**పచ్చిరొట్టను సాగు చేయాలి**

పశువుల వ్యర్థాలు, వర్మీకంపోస్టు లభ్యం కాని రైతులు పచ్చిరొట్ట పైర్లను కూడా సాగు చేసుకోవచ్చు. పంటలు వేసేందుకు కనీసం నెల రోజుల ముందుగా పిల్లిపెసర, జీలుగ, జనుము వంటి విత్తనాలను చల్లుకోవాలి. అవి బాగా ఏపుగా పెరిగిన తర్వాత ట్రాక్టర్‌తో భూమి లోపల వరకు కలియదున్నాలి. అవి కావలసిన సారాన్ని భూమికి అందిస్తాయి.

**సేంద్రియ ఎరువుల వల్ల ఉపయోగాలు**

- భూమిలో తేమ శాతం పెరగడంతో పాటు మొక్కలకు సరిపడా తేమను అందించేందుకు ఉపయోగపడుతుంది.
- పంటకు కావలసిన ముఖ్య పోషకాలు సేంద్రియ ఎరువుల వల్ల అందుతాయి.
- సేంద్రియ ఎరువును భూమిలో కలపడం ద్వారా మొక్క త్వరగా భూమిలోకి చొచ్చుకుని పోయి ఏపుగా పెరుగుతుంది.
- సేంద్రియ ఎరువును ఎండాకాలంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నే ముందు భూమిలో చల్లి కలియదున్నితే వర్షాలకు ఎరువు కొట్టుకుపోకుండా ఉంటుంది.

**పెట్టుబడులు తగ్గుతాయి**



సేంద్రియ ఎరువులు వాడడం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. పశువుల వ్యర్థాలు, పచ్చిరొట్ట పైర్లను సాగుచేయడం వల్ల భూమి సారవంతమవుతుంది. దీంతో పంట ఏపుగా పెరగడంతోపాటు పెట్టుబడులు కూడా తగ్గుతాయి. విచ్చలవిడిగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల చౌడు భూములుగా మారే ప్రమాదం ఉంది.

–ఉమ, ఏడీ, వ్యవసాయశాఖ, చిత్తూరు

## ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి



మురుగునీటి కాలువను పరిశీలించి, అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు అర్బన్: ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు దృష్టి సారించాలని, ఇందు కోసం ప్రణాళికతో ముందుకు వెళ్లాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సూచించారు. ఎమ్మెల్యేతో పాటు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ, కార్పొరేషన్ అధికారులు 31, 32 వార్డుల పరిధిలో ఆదివారం పర్యటించారు. ఆర్టీసీ డిపో రోడ్డు, బి క్రాస్, టెలిఫోన్ కాలనీలో మురుగు నీటి కాలువలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగునీటి కాలువల్లో పూడిక పూర్తిస్థాయి తొలగించాలని, ప్రజలు ఫిర్యాదు చేసిన ప్రాంతాల్లో కాలువల వెడల్పు, మరమ్మతులు పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఈ– క్రాస్ లో 32వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎఫ్ క్రాస్, వినాయకుని గుడి వీధి, రాంనగర్, రాంనగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో పర్యటించారు. మురుగునీటి కాలువల్లో లెవలింగ్ అడ్జస్ట్ చేయడం ద్వారా మురుగు నీరు నిలవకుండా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాడైన కల్వర్టులను మరమ్మతు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, రెవెన్యూ అధికారి గోపాలకృష్ణ వర్మ, డీఈ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు, మాజీ మేయర్ హేమలత పాల్గొన్నారు.

## సేవలే కలకాలం గుర్తుంటాయి



తుంబకుప్పంలో రమేష్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: ఉద్యోగం చేస్తున్నప్పుడు చేసిన సేవలే కలకాలం గుర్తుండి పోతాయని, ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిచ్చేలా మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తాయని మండల విద్యాశాఖాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కేవీ రమేష్ ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం పార్థసారథి అధ్యక్షతన సన్మానం చేశారు. ఎంఈఓ రమేష్ చేసిన సేవలను కొనియాడారు. రమేష్ దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

# అలరించిన దుర్యోధన వధ



దుర్యోధన ప్రతిమ నుంచి మట్టిని సేకరిస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహాభారత యజ్ఞ మహోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరం కనికాపురంలో ఆదివారం జరిగిన దుర్యోధన వధ అలరించింది. తొలుత స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద మట్టితో దుర్యోధనుడి ప్రతిమను తీర్చిదిద్దారు. ఆలయం నుంచి పోతురాజుతో పాటు స్వామి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. భీముడు, దుర్యోధన వేషధారులు యుద్ధ ఘట్టాన్ని ప్రదర్శించారు. భీముడి వేషధారి గదతో దుర్యోధనుడి తొడపై కొట్టడంతో నాటకం ముగిసింది. అనంతరం దుర్యోధనుడి మట్టి కోసం ప్రజలు ఎగబడ్డారు. సాయంత్రం అగ్నితొక్కే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

### ఎస్ఐ అనిల్ కుమార్ బాధ్యతల స్వీకరణ



తవణంపల్లె: స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఎస్ఐగా వచ్చిన ఎం.అనిల్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎస్ఐ సుధాకర్ రెడ్డి బదిలీ కావడంతో చిత్తూరు ఎస్‌బీలో విధులు నిర్వర్తిస్తున్న అనిల్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పదవీబాధ్యతలు చేపట్టినట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను విచారించి సత్వర పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన, అనుమతి లేకుండా అక్రమ రవాణా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

### చికిత్స పొందుతూ వీఆర్‌ఓ మృతి



పయణి (ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని మొగిలివెంకటగిరి గ్రామ రెవెన్యూ అధికారి పయణి ఆదివారం వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం హైబీపీకి గురికావడంతో కుటుంబ సభ్యులు వేలూరు సీఎంసీలో చేర్పించారు. హైబీపీ కారణంగా బ్రెయిన్ డెడ్ కావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పయణి మొగిలివెంకటగిరి వీఆర్‌ఓగా, తగ్గువారిపల్లె ఇన్‌చార్జి వీఆర్‌ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీఆర్‌ఓ అకాల మరణం చెందడంపై మండల రెవెన్యూ సిబ్బంది, పలువురు వీఆర్‌ఓలు విచారం వ్యక్తం చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

### భక్తులతో బోయకొండ కిటకిట

- ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మా..అమ్మ తల్లీ..బోయకొండ గంగమ్మా..! సుఖశాంతులతో ఉండేలా మమ్మల్ని దీవించు తల్లీ.. అని మొక్కుతూ పూజలు చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు, మూగజీవాల సంపద వృద్ధి చెందాలంటూ పలు గ్రామాల ప్రజలు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయంలో రద్దీ పెరగడంతో క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసి పోయాయి. తమ కోర్కెలు, మొక్కులు ఫలించిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

# సూపర్ బజార్‌పై టీడీపీ రాజకీయ కక్ష

- నిర్వీర్యం చేయాలని కుట్రలు, కుతంత్రాలు
- సూపర్ బజార్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్

పలమనేరు: రాష్ట్రంలోనే లాభాల్లో ఉన్న పలమనేరు సహకార బాలాజీ సూపర్‌బజార్‌ను ఎలాగైనా నాశనం చేయాలనే కుట్రతో ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టీడీపీ ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఫిర్యాదులు చేస్తోందని పలమనేరు సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్వీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. స్థానిక సూపర్‌బజార్‌లో ఆదివారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. టీడీపీ తప్పుడు ఫిర్యాదుతో మూడ్రోజుల క్రితం జిల్లా సహాయ సహకార సంఘ అధికారి, స్థానిక ఆర్డీఓ ఇక్కడ విచారణ చేసి ఎలాంటి అక్రమాలు జరగలేదని తేల్చిన విషయాన్ని జనం గుర్తుంచుకోవాలన్నారు. తాను 1986 నుంచి సూపర్‌బజార్ అధ్యక్షుడిగా ఎన్నికవుతూనే ఉన్నా, నాడు ఏడు వేలు ఓటర్లుండగా ఇప్పుడు 14వేల ఓటర్లున్నారని తెలిపారు. ఏటా సూపర్‌బజార్‌కు సంబంధించిన లెక్కలను ఆడిటర్ ద్వారా అన్ని సక్రమంగానే నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది సైతం రూ.29.50 లక్షల ఆదాయం సూపర్‌బజార్‌కు వచ్చిందన్నారు. ఇక్కడ ఎందుకు లాభాలు తక్కువగా ఉంటాయంటే ఇది ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన సొసైటీ కాబట్టి ఇన్నేళ్లుగా తక్కువ ధరలకే వస్తువులను విక్రయిస్తున్నామన్నారు. పట్టణంలో ఎన్నో కార్పొరేట్ సంస్థలున్నా సూపర్‌బజార్ రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉందంటే దానికి తమ పటిష్టమైన పాలనే కారణమన్నారు. ఇలాంటి సహకార సంఘానికి ఎన్నికలు జరగకపోవడం కాస్త ఇబ్బందే అయినా ఇప్పటికీ లాభాల్లో నడుస్తుందున్నందున దీనిపై ఏ రాజకీయ పార్టీ గానీ తమను ఇబ్బంది పెట్టింది లేదన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా వ్యాపారం బాగున్నందున పాత కమిటీనే వారు కొనసాగించారనేది గుర్తుంచుకోవాలన్నారు. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టీడీపీ ఈ సూపర్‌బజార్‌పై కక్ష గట్టి లేనిపోని ఆరోపణలు చేయడం ఇది రాజకీయ కక్షేనని మండిపడ్డారు. టీడీపీ నాయకుడు ఇక్కడ అవినీతి జరుగుతోందని సూపర్‌బజార్‌పై బురద చల్లేందుకు ఫిర్యాదులు చేసినా ఇక్కడ విచారణ చేసిన అధికారులు ఎలాంటి అక్రమాలు లేవని తేటతెల్లం చేయడం ప్రజలకు అర్థమై ఉంటుందన్నారు. సూపర్‌బజార్‌లో ఎక్కడైనా తప్పులు జరిగి ఉంటే ఎవరైనా సరే విచారణ చేసుకోవచ్చునని, తనపై టీడీపీ నేతలు లాభాల బాటలో ఉన్న సూపర్‌బజార్‌పై కుట్రలు కుతంత్రాలకు పాల్పడరాదని హితవు పలికారు. ఏదేమైనా సూపర్ బజార్ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ ప్రభుత్వం కక్ష సాధింపులకు పూనుకోకుండా అవసరమైతే ఎన్నికలు నిర్వహించుకోవచ్చన్నారు.

# టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా నిల్వలు
- ప్రతి శని, బుధవారాల్లో ఉచితంగా టీకాలు



వరదయ్యపాళెం మండలం పెద్ద పాండూరులో టీకాలు వేసేందుకు సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



టీకాలు వేసేందుకు గర్భిణుల వివరాలు తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది

వరదయ్యపాళెం: వ్యాధుల నుంచి జీవితాంతం రక్షణ పొందాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గర్భిణుల నుంచి అప్పుడే పుట్టిన చిన్నారుల వరకూ ప్రభుత్వం సూచించిన సమయాల్లో టీకాలు వేయిస్తే వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యకరమైన జీవితం గడపొచ్చు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సరైన అవగాహన లేక టీకాలు వేయించుకోవడం లేదు. దీని వల్ల వివిధ రకాల వ్యాధులకు గురవుతూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ప్రతి శని, బుధవారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

**వ్యాక్సిన్లు వేసేది ఇలా..**

గర్భిణిగా నిర్ధారణ అయిన 3 నెలలు నిండిన తర్వాత ఒక టీటీ ఇంజెక్షన్, అనంతరం ఇంకో నెల రోజుల వ్యవధిలోనే మరో టీటీ ఇంజెక్షన్ వేయాలి. వీటితో పాటు ఐరన్ ఫోలిక్, క్యాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్లు ఇస్తారు. అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్–బి డోసు వేయాలి. వీటి వల్ల పోలియో, పచ్చ కామెర్ల వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. 14 రోజుల వ్యవధిలో క్షయ రాకుండా బీసీజీ టీకా వేయించాలి. 6, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి. 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటివల్ల కోరింత దగ్గు, కంఠ సర్పి, ధనుర్వాతం, మెదడువాపు, పచ్చకామెర్లు వంటి వ్యాధుల నుంచి చిన్నారిని కాపాడుకోవచ్చు. తొమ్మిది నెలల నుంచి 12నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్–ఏ చుక్కలు వేయించాలి. తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకూ ప్రతి ఆరు నెలలకోసారి విటమిన్–ఏ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు ఇప్పించాలి. 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోసు డీపీటీ, మీజిల్స్, విటమిన్–ఏ ఓపీని వేయించాలి. ఐదేళ్లు పూర్తయిన తర్వాత డీపీటీ డోసు వేయించాలి. 10, 16 సంవత్సరాలు పూర్తయితే టీటీ వేయించాలి.

**టీకాలు తప్పనిసరి**



గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలి. వీటి వల్ల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజలకు టీకాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ ఉదయ్‌కుమార్, వైద్యాధికారి, వరదయ్యపాళెం పీహెచ్‌సీ